ఆరోజు లగాయతు హైమ జోగారావు కుటుంబంలో చేరిపోయింది.

ఆమెకు జోగారావు తెచ్చిన సంబంధం కూడా నా కాశ్చర్యం కలిగించింది. సూర్యనారాయణ మేధావీ, స్ఫురద్రూపీ చిన్న జమీందారునూ! అతను బి. ఏ ఆనర్సు పాసయి హైమకోసం కనిపెట్టుకున్న వాడల్లే పెళ్ళీ పెటాకులూ లేకుండా ఊరికే కూర్చున్నాడు. జోగారావు ఈ సూర్యనారాయణను ఎప్పుడు ఎక్కడ ఏగాలంవేసి పట్టాడో నాకైతే తెలియదు గాని ఆ కుర్రవాడితో ఒకటి రెండు సార్లు మాట్లాడిన తరవాత హైమవంటి విద్యాధికురాలికి అంతకంటే మంచిభర్త దొరకదనుకున్నాను. నిజంగా ఆ పెళ్ళే జరిగితే జోగారావును గురించి నా అభిప్రాయం యావత్తూ ఒక్కక్షణంలో మార్చేసుకోవటానికి కూడా సంసిద్ధుణ్ణయినానంటే నమ్మండి.

అయితే జోగారావు దిగ్విజయానికి తలవని తలంపుగా మరొక అంతరాయం వచ్చింది—హైమ తనకు పునర్వివాహం అవసరం లేదన్నది.

"మా అమ్మమ్మ అంటూండేది—వెధవముండ పెళ్లి వెధవపెళ్ళే నవి. అది నిజంకూడానూ!" అన్నది హైమ కిరుకుగా.

"ఏం! ఏం!" అన్నాడు జోగారావు నోటమాట రాక.

"ఈ వెధవ పెళ్ళిళ్ళు సామాన్యంగా సరిగా పరిణమించవు. ఏదో వంక రానే వస్తుంది!" అని హైమ సమాధానం చెప్పింది.

"నాన్సెన్స్! మామూలు పెళ్ళిళ్ళుకూడా అంతే. ఆ మాటకువస్తే" అన్నాడు జోగారావు, బహుశా తన పెళ్ళి స్మరిస్తూ.

"ఆ పెళ్ళిళ్ళు ఎట్లా తగలబడినా ఫరవాలేదు. అవి సంఘదేవతకు బలులు! పితృదేవతలు తరించటానికి చేసేవి ఆ పెళ్ళిళ్లు చెయ్యకపోతే ఆడపిల్లలు అంటరాని వాళ్ళవుతారు! చేజేతులా అటువంటి పెళ్లే మళ్ళీ, ఎరిగి ఎరిగి, ఎవరి ప్రోద్బలమూ లేకుండా పైగా నలుగురి ఇష్టాన్నీ తిరస్కరిస్తూ చేసుకోవటం బుద్ధి తక్కువ కామా?" అన్నది హైమవతి ఒకే గుక్కలో.

"అదేంమాట? ఇతర విధవా వివాహాలు ఎట్లా అయితే నీ కెందుకు? నీకు అన్నివిధాలా నచ్చిన మొగుడు దొరికితేనే చేసుకో. లేకపోతే మానెయ్యి!" అన్నాడు జోగారావు.

"అదే నేనూ అంటున్నా!" అన్నది హైమ.

ఆ మర్నాడు సాయంకాలానికల్లా గారడివాడు మంత్రించి బుట్టలోవించి తీసినట్టు జోగారావు ఎక్కణ్ణుంచో సూర్యనారాయణను ప్రొడ్యూస్ చేశాడు!

ఆ మొదటిరోజు సంభాషణలో జోగారావు, విశేషం కల్పించుకోలేదు. వెయ్యికళ్ళతో సూర్యనారాయణనూ, హైమ

సూర్యనారాయణకు అప్పులేమాత్రమో ఉంది ఉండాలి. ఆస్తి ఉన్నవాడికే అప్పులు. ఈ వత్తిడి జాస్తి కావటం వల్ల ఆ వ్యవహారాలు పరిష్కరించుకోటానికి సూర్యనారాయణ వాళ్ళ వూరు వెళ్ళాడు.

అతను వెళ్ళిన మరుక్షణంనుంచీ హైమవతి పూర్తిగా మారిపోయింది. గుబులుగా, పరధ్యానంగా ఉండసాగింది. పలకరిస్తే సరిగా సమాధానం చెప్పక పొయ్యేది. జోగారావుకిదంతా అర్థం కాలేదు మొదట హైమవతి తనను ఈ విధంగా మోసపుచ్చుతున్న దనుకున్నాడు. కాని రోజులు గడిచినకొద్దీ హైమ యథార్థంగానే బాధపడుతున్నట్టు రూఢిఅయింది ఒకసారి ఆమె కళ్ళల్లో తడి కూడా చూశాడు జోగారావు.

కారణం అడిగితే హైమ చెప్పేసింది. "తనకెంత అప్పున్నదీ సూర్యం తెలుసుకోలేదు. అతనికేమీ మిగలదు. అతనికి వాళ్ళవాళ్ళు రాసిన ఉత్తరం చూశాను నా గతి ఏంకావలిసి ఉంది?''

''నీ గతికేం?"

''సూర్యం నన్ను పెళ్ళిచేసుకోకపోతే''....ఆయనను మనింటి కెందుకు రానిచ్చావు బాబాయి? ఇంకోమనిషి నన్ను అట్లా ఆకర్షించే అవకాశం నా జన్మలో ఏముంది?''

''నీ కంత మమకారంవుంటే, డబ్బు లేకపోతే పోయింది. అతన్ని పెళ్ళాడ రాదూ? అతనన్నట్టు నీవతని డబ్బుచూసే మోహించావా ఏమిటి?'' అన్నాడు జోగారావు.

''నీ వర్థం చేసుకోవు. ఆ డబ్బు వెనక లేకపోతే సూర్యం అందరివంటి మొగుడే అవుతాడు. నన్నాకర్షించింది అందరివంటి మొగవాడు కాదు!''

"నా తలకాయల్లే ఉంది!'' అన్నాడు జోగారావు.

కొద్ది రోజులకు సూర్యం దగ్గిరనుంచి ఉత్తరం వచ్చింది. అనుకున్నంతా అయింది. అతని ఆస్తి యావత్తూ పోయింది. ''కాని నా అదృష్టం ఇంకా నన్ను విడవలేదు.'' ''నాకొక సంబంధం వచ్చింది. ఆ పిల్లవెంట ఇరవై అయిదువేల రూపాయల ఆస్తి వస్తున్నది. నిన్ను ప్రేమించే అధికారం నేను సొంతంగా పోగొట్టుకోలేదు ''

''నాకా చివరముక్క అర్థంకాలేదు '' అన్నాడు జోగారావు అనుమానంతో. ఇంతకాలానికి వికసించిన మోహంతో హైమ ''నా కర్థమయింది ' అన్నది.

